సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం ׀ 17 ׀ సెప్టెంబర్ ׀ 2024



50 టీఎంసీలు దాటిన సోమశిల

సోమశిల: జలాశయం సోమవారానికి 50.158 టీఎంసీలకు చేరుకుంది. 14,300 క్యూసెక్కుల వరద వస్తుండగా, పెన్నార్ డెల్టాకు 50 క్యూసెక్కులు, ఉత్తరకాలువకు 5, దక్షిణకాలువకు 10 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.75,940
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,888
3శాతం జీఎస్టీతో	రూ.7,094
నవర (8 గ్రా)	రూ.56,752

గరిష్టం/కనిష్టం
38.2 /28.4

వాతావరణం

జిల్లాలో మంగళవారం వాతావరణం పొడిగా ఉంటుంది. పగటి, రాత్రి ఉష్ణోగ్రతలు అత్యధికంగా ఉంటాయి. గాలిలో తేమ 39 శాతం ఉంది.

న్యూస్‌రీల్

25 వరకు ఈ క్రాప్ గడువు పొడిగింపు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలోని పంటల నమోదులో చేయాల్సిన ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ గడువు ఈ నెల 25 వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధానంగా ఈ నెల 15తో గడువు ముగిసిందని, జిల్లాలో చాలా చోట్ల నమోదులో కాలేదని, దీంతో గడువు పెంచినట్లు తెలిపారు. జిల్లాలోని వివిధ పంటలు వేసిన రైతులు ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు, ఈకేవైసీ నమోదు చేసుకోవాలని కోరారు. గ్రామాల్లోని వ్యవసాయ సహాయకులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

29న పెద్ద ఉరుసు

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని పవిత్ర పుణ్యక్షేత్రం హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ఈ నెల 29న పెద్ద ఉరుసు జరగనున్నట్లు నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25వ తేదీ బుధవారం ఫకీర్ సాహెబ్ ఇంటి నుంచి గలేపులను తీసుకొచ్చి హజరత్ సమాధికి కప్పడం, 26వ తేదీ గురువారం ఝులేలా ఉత్సవం, 29న గంధమహోత్సవం జరుగుతుందని తెలిపారు. 30వ తేదీ చిరాగా ఉత్సవం, 1వ తేదీ తహలీల్ ఫాతేహాతో గంధమహాహోత్సవం ముగుస్తుందన్నారు.

నాకేమి తెలియదు.. సంబంధం లేదు..

- మూడు రోజుల విచారణలో జయవర్ధన్ సమాధానం
- ఒక రోజు ముందే జైలుకు తరలింపు

నెల్లూరు (క్రైమ్): నెల్లూరు నగరపాలక సంస్థలో గత కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మేయర్ భర్త జయవర్ధన్‌ను నాలుగు రోజులు విచారణ నిమిత్తం పోలీసుల కస్టడీకి తీసుకున్నారు. అయితే మూడు రోజుల పాటు జరిగిన విచారణలో నోరు మెదపలేదని సమాచారం. పోలీసులు ఏమి అడిగినా నాకేమి తెలియదు.. నాకేమి సంబంధం లేదుంటూ సమాధానాలు ఇవ్వడంతో చేసే దేమిలేక మంగళవారం వరకు కస్టడీకి అనుమతి ఉన్నప్పటికి ఒక రోజు ముందుగానే ఆయన్ను సోమవారం పోలీసు అధికారులు జిల్లా కేంద్ర కారాగారానికి తరలించారు. నగరపాలక సంస్థ పూర్వ కమిషనర్ల సంతకాల ఫోర్జరీ కేసులో ఈ నెల 10వ తేదీ నుంచి జయవర్ధన్ జిల్లా కేంద్ర కారాగారంలో రిమాండ్‌లో ఉన్నారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టేందుకు పోలీసు కస్టడీకి అనుమతివ్వాలని దర్గామిట్ట పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశా రు. కోర్టు నాలుగు రోజుల కస్టడీకి అనుమతినిస్తూ ఆయన తరఫు లాయర్ల సమక్షంలోనే విచారించాలని సూచించింది. ఈ నెల 14వ తేదీన జయవర్ధన్‌ను పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందం విభిన్న కోణాల్లో జయవర్ధన్‌ను విచారించారు.



నీట్‌లో 500 మార్కులు దాటినా సీటు రాలేదు



ఈ ఏడాది నీట్ పరీక్షలో 511 మార్కులు వచ్చాయి. అయినా ఏ కళాశాలలో సీటు రాలేదు. గతంలో 500 మార్కులకు సీటు వచ్చేది. సీటు రాకపోవడంతో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కొత్తగా 17 మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. ఈ కళాశాలలను ప్రారంభించిస్తే నాలాంటి ఎంతో మందికి మెడిసిన్ చదువుకునే అవకాశం ఉండేది. ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. కొత్త కళాశాలల్లో మొదటి సంవత్సరం అడ్మిషన్లు కూడా ప్రారంభించకపోవడం దుర్మార్గ చర్య.

– మంచు చేతన్, నీట్ విద్యార్థి



ప్రైవేట్ పరం చేయడం అన్యాయం



నీట్ పరీక్షలో 490 మార్కులు వచ్చాయి. ఎక్కడా సీటు రాకపోవడంతో మళ్లీ నీట్ పరీక్షకు లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్నాను. గత ప్రభుత్వం కొత్తగా తెచ్చిన మెడికల్ కళాశాలల్లో దశల వారీగా అందుబాటులోకి తెచ్చి అడ్మిషన్లు ప్రారంభించింది. దాదాపు పూర్తయిన కళాశాలలకు సీట్లు కేటాయించినా.. కొత్త ప్రభుత్వం ఆ సీట్లు మాకొద్దు అంటూ తిరస్కరించడం నాలాంటి విద్యార్థులకు ద్రోహం చేయడమే అవుతుంది. మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేస్తే ఎంతో మంది విద్యార్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉంది. ఈ నిర్ణయాన్ని ఉప సంహరించుకుని వసతుల కల్పన త్వరిత గతిన పూర్తి చేస్తే సీట్లు పెరుగుతాయి.

– కె.వెంకటరమణ, నీట్ విద్యార్థి

కర్కశ రాజ్యం.. ఖాకీల క్రౌర్యం



రెడ్‌బుక్ రాజ్యాంగంలో పోలీసులు పావులు

- ఆరుగురు దళిత బిడ్డలను స్టేషన్‌లో నిర్బంధించి చితకబాదిన వైనం
- తోపులాట జరిగితే హత్యాయత్నం కేసు నమోదు
- జై భీమ్ సినిమా కథను తలపిస్తున్న పోలీసుల తీరు
- ఎమ్మెల్యే సోమిరెడ్డి ప్రోద్బలంతోనే అంటూ దళితుల ఆరోపణలు
- అధికార పార్టీకి చెందిన వారిపైనే పోలీసుల దుశ్చర్య

జిల్లాలోని పోలీసులు రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారు. ప్రధానంగా సర్వేపల్లిలో ఎన్నికల ఫలితాలు వెలువడిన నాటి నుంచి కర్కశ రాజ్యమేలుతోంది. ఆ పార్టీ నేతలు బరితెగించి పోలీసుల సమక్షంలోనే ప్రతిపక్ష మద్దతుదారులపై దాడులకు పాల్పడుతున్నారు. ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా.. కేసులు బనాయిస్తున్నారు. తాజాగా అధికార పార్టీ పెద్దల అండతో మరో అడుగు ముందుకేసి దళిత బిడ్డలపై ఖాకీలు తమ క్రౌర్యం ప్రదర్శించారు. స్టేషన్‌లో నిర్బంధించి ఒళ్లు హూనమయ్యేలా కుళ్లబొడిచారు. చివరకు బాధితులపైనే హత్యాయత్నం కేసు నమోదు చేసి జైలుకు పంపించారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఖాకీలు అధికార పార్టీ పెద్దల ప్రాపకం కోసం మానవత్వాన్ని మరిచి క్రూరత్వాన్ని ప్రదర్శిస్తున్నారు. స్వల్ప వివాదంపై ఆరుగురు దళిత బిడ్డలను స్టేషన్‌లో నిర్బంధించి ఒళ్లు రక్తం ఒడిసేలా లాఠీలతో కుళ్లబొడిచారు. ఆ యువకుల శరీరంపై లాఠీ దెబ్బలు చూస్తే కఠిన హృదయాలు సైతం కదిలిపోయాయి. న్యాయం కోసం దళిత వర్గాలు రోడ్డెక్కారని ఆ దళిత బిడ్డలపై ఏకంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారు. వెంకటాచలంలో జరిగిన కేసుకు సంబంధించి ముత్తుకూరు ఎస్సై, కానిస్టేబుల్ తమ పరిధిలో దాటి వచ్చి ఇంత అమానుషంగా ప్రవర్తించారు. ఈ దాష్టీకంలో పాలుపంచుకున్న పోలీసులను కాపాడేందుకు చేయని ప్రయత్నాలు లేవు. ఇంత జరుగతున్నా పోలీస్ బాస్ పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

అసలేం జరిగిందంటే..

వెంకటాచలం మండలం గుడ్లూరువారిపాళెం మజరా మొలకలపూడికి చెందిన వేణుకు ముత్తుకూరు చెందిన హరీష్‌కు పాత కక్షలు ఉన్నాయి. మొలకలపూడిలో జరిగిన వినాయకుడి నిమజ్జనంలో వాయిద్యాలు వాయించేందుకు హరీష్, చక్రవర్తి మరో నలుగురు యువకులతో కలిసి వెళ్లారు. ఈ క్రమంలో పాత కక్షలను మనస్సులో పెట్టుకున్న వేణు వారితో గొడవ పడ్డాడు. ఈ క్రమంలో తనపై హరీష్, చక్రవర్తి మరో నలుగురు యువకులు హత్యాయత్నం చేశారని వేణు వెంకటాచలం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హరీష్ కూడా తన స్నేహితులతో కలిసి ముత్తుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లాడు. అయితే ముత్తుకూరు ఎస్సై బాధితుల ఫిర్యాదు స్వీకరించకపోగా వారిని వెంకటాచలం పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి నిర్బంధించి చితకబాదారు. వారికి సంబంధం లేకపోయినా, వారి పరిధి కాకపోయినా దళిత యువకులను విచక్షణా రహితంగా లాఠీలతో కొట్టారు. పోలీసులు కొట్టిన దెబ్బలతో శరీరమంతా రక్తం గడ్డ కట్టి గాయాలు కనిపించాయి. ఈ వ్యవహారం వెలుగులోకి రావడంతో పోలీసులు హడావుడిగా వారిపై ఏకంగా హత్యాయత్నం కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచి జైలుకు పంపారు. ఈ వ్యవహారం మొత్తం జై భీమ్ సినిమా కథను తలపిస్తోంది.





పోలీసుల లాఠీ దెబ్బలకు రక్తం గడ్డ కట్టిన దళిత బిడ్డల ఒళ్లు

పోలీసులపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలి

- బాధిత కుటుంబ సభ్యుల డిమాండ్



దళిత యువకులపై జరిగిన అమానుష దాడి పోస్టర్లు చూపిస్తున్న బాధితుల కుటుంబ సభ్యులు

నెల్లూరు (బృందావనం): తమ బిడ్డలను అమానుషంగా కొట్టిన పోలీసులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని ముత్తుకూరుకు చెందిన దళితులు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యార్థుల మధ్య ఏర్పడిన వివాదంలో తమ బిడ్డలు అమావాస్య హరీష్, సందీప్‌తో పాటు నలుగురిని ముత్తుకూరు ఎస్సై విశ్వనాథరెడ్డి, కానిస్టేబుల్ సుమన్ దారుణంగా లాఠీలతో విచక్షణా రహితంగా కొట్టి హింసించారన్నారు. ముత్తుకూరు, వెంకటాచలం పోలీస్‌స్టేషన్లలో అక్రమంగా నిర్బంధించి అక్రమంగా హత్యాయత్నం కేసు నమోదు చేశారన్నారు. దళిత నేత చాట్ల వెంకటసుబ్బయ్య ఊసరవెల్లిలా రంగులు మార్చినట్లు పార్టీలు మారుస్తుంటాడని విమర్శించారు. దళితులకు అన్యాయం జరిగితే ప్రశ్నించాల్సింది పోయి తప్పు చేసిన వారికి వత్తాసు పలికేలా వెంకటసుబ్బయ్య ప్రయత్నాలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. దళితులపై జరిగిన దాడిని తెలుసుకుని పరామర్శించేందుకు వెళ్లిన దళిత నాయకులైన కొప్పోలు రఘు, వాదనాల వెంకటరమణను తప్పుపట్టే అర్హత వెంకటసుబ్బయ్యకు లేదన్నారు. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి ముత్తుకూరు, వెంకటాచలం పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, వెంకటాచలం సీఐ సుబ్బారావుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో బాధితుల కుటుంబ సభ్యులు ఎ.పద్మ, ఎ.అను, టి.శారద, ఎన్.ప్రకృతమ్మ, కె.పోలమ్మ, బి.రమేష్ తదితరులు పాల్గొన్నారు. పోలీసుల లాఠీ దెబ్బలకు తీవ్రంగా గాయపడిన యువకుల ఫొటోలను ప్రదర్శించారు.

సోమిరెడ్డి విజయం కోసం పనిచేసిన దళితబిడ్డలు

దళిత యువకులపై పోలీసులు లాఠీ దెబ్బలు, ఈ దారుణానికి పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకోపోవడం వెనుక అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లు ఉన్నట్లుగా ప్రచారం ఉంది. బాధిత యువకులు సైతం అధికార పార్టీకి చెందిన వారే. వీరంతా ఇటీవల జరిగిన ఎన్నికల్లో స్థానిక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గెలుపు కోసం పని చేశారు. టీడీపీ తరఫున ఏజెంట్లుగా పనిచేశారు. అయితే సదరు అధికార పార్టీ పెద్దలు మరో సామాజిక వర్గానికి కొమ్ముకాస్తూ దళితులపై దాడిని, పోలీసులను ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. సోమిరెడ్డి గెలుపు కోసం పనిచేసిన దళితులపై పోలీసులు దాడి చేసినా ఎమ్మెల్యేగా ఉండీ పట్టించుకోకపోవడంపై దళితులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

న్యాయం కోసం పోరాటం

దళిత వర్గాలు తమ బిడ్డలకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం నాలుగు రోజులుగా పోరాటం చేస్తున్నారు. ఎస్పీ కృష్ణకాంత్‌ను కలిసి పోలీసుల అమానుషత్వంపై విచారించి న్యాయం చేయాలని వేడుకున్నారు. ఒక వేళ తప్పు చేసి ఉన్నా.. పోలీసులు విచక్షణ మరిచి లాఠీలతో కుళ్ల పొడవడం న్యాయమేనా అంటూ పోలీసులను నిలదీస్తున్నారు. దళితులపై క్రూరంగా వ్యవహరించిన పోలీసులపై కనీస విచారణకు ఆదేశించలేదని దళిత వర్గాలు పోలీసుల తీరుపై భగ్గుమంటున్నాయి.



సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి

మాజీ ఎంపీ మేకపాటి దాతృత్వం

- తెలంగాణ వరద బాధితులకు రూ.25 లక్షల విరాళం
- సీఎం రేవంత్‌రెడ్డికి చెక్కు అందజేత

నెల్లూరు (బృందావనం): ఇటీవల వరదలతో తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ప్రజలు ఇబ్బందులకు గురికావడంతో నెల్లూరు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మేకపాటి రాజమోహన్‌రెడ్డి దాతృత్వం చూపించారు. రూ. 25 లక్షలు విరాళం ప్రకటించిన ఆయన సోమవారం హైదరాబాద్‌లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి చెక్కును అందజేశారు. తీవ్ర వర్షాలు, వరదలతో ఇబ్బందులు పడిన ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి మేకపాటి రాజమోహన్‌రెడ్డిని శాలువలతో ఘనంగా సత్కరించారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డి వెంట ఆయన తనయుడు మేకపాటి పృథ్వీరెడ్డి ఉన్నారు.

ఇన్‌పుట్ సబ్సిడీ.. ప్రభుత్వం గారడీ

ఖరీఫ్‌లోనూ వెంటాడిన కరువు

- అన్నదాతలకు కరువు నష్టం కలే
- బీమా వేరు, ఇన్‌పుట్ సబ్సిడీ వేరంటూ వ్యవసాయ శాఖ మంత్రి వక్ర మాటలు
- బోర్లు, బావుల కింద సాగు చేసిన పంటలు ఎండిపోయిన వైనం
- ఈ–క్రాప్, బీమా నమోదుపై ప్రభుత్వం మీనమేషాలు
- గత ప్రభుత్వం ఈ–క్రాప్‌తో సీజన్ ముగిసేలోపే పరిహారం
- టీడీపీ హయాంలో నష్టాన్ని చెల్లించిన వైఎస్ జగన్ ప్రభుత్వం

జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అన్నదాతలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా లేదని స్పష్టమవుతోంది. గత ప్రభుత్వం ప్రతి ఏటా ఖరీఫ్ ప్రారంభంలోనే రైతులకు వైఎస్సార్ రైతు భరోసా పథకం కింద సాగు పెట్టుబడి సాయం అందించేది. రైతులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కంటి మిన్నగా ఆదుకుంటామని హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం ఎగనామం పెట్టింది. ఇక ఉచిత పంటల బీమా పథకానికి ఈ ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడంతో ఈ ఏడాది కరువు బారిన పడిన ఖరీఫ్ సాగుదారులకు కన్నీళ్లే మిగులుతున్నాయి.

కావలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్నదాత పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ సీజన్‌లో పంట సాగు చేస్తే ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే ఆ సీజన్ ముగిసేలోపు పంట నష్టపరిహారాన్ని అందించింది. అయితే పంట నష్టపరిహారానికి సంబంధించి కూటమి ప్రభుత్వం ఇన్‌పుట్ సబ్సిడీ విషయంలో గారడీ చేస్తోంది. బీమా వేరు, ఇన్‌పుట్ సబ్సిడీ వేరంటూ సాక్షాత్తు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కొత్త భాష్యం చెబుతూ రైతుల చెవుల్లో పువ్వులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. గడిచిన రెండేళ్ల పరిశీలిస్తే.. 2023లో జిల్లాలో రబీలో సీజన్‌లో 2,97,108 ఎకరాలు, ఖరీఫ్ సీజన్‌లో 1,77,170 ఎకరాలకు నాటి ప్రభుత్వం ఈ క్రాప్ చేసింది. అందుకు సంబంధించి 2023లో రూ.32.23 కోట్లు, 2024లో 23.2 కోట్లు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి రైతులను ఆదుకుంది. టీడీపీ హయాంలో 2018లో వచ్చిన తిత్లీ తుఫాన్‌కు నష్టపోయిన ఉద్యాన రైతులకు సంబంధించి 2022 జూన్ 22 రైతులకు పరిహారం అందించింది.

ఈ–క్రాప్‌తో బీమా.. రైతుకు ధీమా

గత ప్రభుత్వం హయాంలో పంట సాగు చేసిన ప్రతి సీజన్‌కు ఈ–క్రాప్ నమోదు చేసేది. ఆ మేరకు ప్రభుత్వమే బీమా చెల్లించేది. పంట నష్టం జరిగితే ఆ వెనువెంటనే అందించేది. భారీ వర్షాలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా, కరువు వచ్చినా పరిహారం అందించడానికి ఈ క్రాప్, ఉచిత పంట బీమా పథకం ఎంతగానో ఉపయోగపడింది. 2023 ఖరీఫ్ సీజన్‌లో కరువు, డిసెంబర్‌లో మిచాంగ్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ఈ ఏడాది మార్చి 6వ తేదీన పరిహారం అందజేసింది. ఏ సీజన్‌లో పంట నష్టపోతే మరుసటి సీజన్ ప్రారంభానికి ముందే పరిహారం అందించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని రైతులు చెబుతున్నారు.

జిల్లాలో 2014 నుంచి 2019 అధికారంలో టీడీపీ హయాంలో భారీ వర్షాలు, వరదలు, తుఫాన్లు వచ్చిన పంట నష్టపోయిన రైతులకు పైసా పరిహారమిచ్చిన దాఖాలు లేవు. దాదాపు నాలుగేళ్లు కరువు విలయ తాండం చేసినా రూపాయిచ్చి ఆదుకున్నది లేదు. పైగా రుణమాఫీ పేరుతో రైతులను ఆనాటి టీడీపీ ప్రభు త్వం మోసం చేసింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రబీ సీజన్‌లో భారీ వర్షాలు కురిసి పంట నష్టపోతే ఇందుకు సంబంధించి 2020 ఏప్రిల్ 26వ తేదీన రైతుల ఖాతాల్లో పరిహారం అందజేశారు. 2020 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు అదే ఏడాది అక్టోబరు 27వ తేదీ పరిహారం అందించారు. అక్టోబరులో కురిసిన భారీ వర్షాలకు నష్టపోతే.. మరుసటి నెల నవంబర్ 17వ తేదీన మరోసారి పరిహారం అందించారు. అదే ఏడాది నవంబరులో నివర్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు మరోసటి నెల డిసెంబర్ 29వ తేదీనే పరిహారం అందించారు. ఇలా ఒకే ఏడాదిలో నాలుగ దఫాలుగా రైతుల ఖాతాల్లో పరిహారం జమ చేసిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది. ఆ తర్వాత 2021 సెప్టెంబర్‌లో వచ్చిన గులాబ్ తుఫాన్‌తో నష్టపోయిన రైతులకు అదే ఏడాది నవంబర్ 16వ తేదీ పరిహారం అందించింది. మళ్లీ నవంబర్‌లో వచ్చిన భారీ వర్షాలకు నష్టపోతే మరుసటి ఏడాది 2022 ఫిబ్రవరి 15వ తేదీ పరిహారం అందించగా, ఇక 2022 ఖరీఫ్ సీజన్‌లో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన రైతులకు అదే ఏడాది నవంబర్ 28న, అదే ఏడాది డిసెంబర్‌లో వచ్చిన మాండోస్ తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు 2023 ఫిబ్రవరి 28న పరిహారం అందించింది. 2023 మార్చి నుంచి మే వరకు కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు అదే ఏడాది జూన్ 1వ తేదీ, అదే ఏడాది ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన ఉద్యాన రైతులకు సెప్టెంబర్ 9వ తేదీన పరిహారం అందించింది.



ఈ ఏడాది ఖరీఫ్‌లోనూ కరువే..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో కరువు విలయతాండవం చేసింది. ప్రధాన జలనిధి సోమశిల 8 టీఎంసీలకే పరిమితం కావడంతో రైతులు ఖరీఫ్ సాగుపై ఆశలు వదులుకున్నారు. పెన్నార్ డెల్టా కింద పూర్తిగా సాగును విరమించుకోగా ఇక బావులు, బోర్ల కింద దాదాపు 50 వేల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఇందులో దాదాపు 10 వేల ఎకరాలకుపైగా పంట సాగు మధ్యలో ఎండిపోయినట్లు వ్యవసాయశాఖ గణాంకాల్లో తేలింది. అయితే ఈ ప్రభుత్వం ఈ–క్రాప్ విధానాన్ని నిర్లక్ష్యం చేసింది. జిల్లాలో లక్షల ఎకరాల్లో పంట సాగు చేసినా.. నిర్దిష్ట వ్యవధిలోనే గత ప్రభుత్వం ఈ–క్రాప్ నమోదు చేస్తే.. కూటమి ప్రభుత్వంలో వేల ఎకరాలను కూడా సమయానికి ఈ–క్రాప్ చేయలేకపోయింది. ఈ–క్రాప్ నమోదు కూడా ఈ నెల 15వ తేదీతో గడువు పూర్తి కాగా, మరో 10 రోజులు పొడిగించింది. 2024–25 వ్యవసాయ సీజన్ కోసం రాష్ట్ర ప్రభుత్వం పంట బీమా నోటిఫిషన్‌లో ప్రైవేట్ బీమా కంపెనీలకు అవకాశం కల్పించింది. రైతులే బీమా చెల్లించాలనే ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో వ్యవసాయ నోటిఫికేషన్‌లోనూ బీమా విధానం ప్రైవేట్ పరం చేయడంతో ఖరీఫ్ సీజన్‌కు కరువు నష్టపరిహారం అందే అవకాశం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

సోమిరెడ్డీ.. స్థాయికి మించి మాటలొద్దు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- నీ స్థాయి ఏంటో అందరికీ తెలుసు
- చంద్రబాబు ప్రాపకం కోసం సోమిరెడ్డి ఆరాటం
- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చురకలు

నెల్లూరు (సెంట్రల్): సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఇటీవల కాలంలో క్యూసెక్కులు, టీఎంసీలు.. అంటూ తన స్థాయికి మించి మాట్లాడుతున్నారని, తన స్థాయిని తెలుసుకుని మాట్లాడితే మంచిదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హితవు పలికారు. నెల్లూరులోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వరదల గురించి సోమిరెడ్డికి కనీసం అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని చురకలంటించారు. సోమిరెడ్డి మంత్రిగా వెలగబెడుతున్న కాలంలో సర్వేపల్లి నియోజకవర్గంలో పంబలేరు వాగుకు గండిపడితే ఐదేళ్లు శాశ్వత పరిష్కారం చేయలేకపోయిన అసమర్థుడు.. ఇప్పుడు అక్కడ యాడో ఏలేరులో వరదల గురించి మాట్లాడుతుంటే హాస్యాస్పందంగా ఉందన్నారు. నీ స్థాయి, నీ పరపతి ఏమిటో అందరికి తెలుసంటూ ఎద్దేవా చేశారు. కాసుల వేట తప్ప.. అభివృద్ధి, సంక్షేమ అనే పదాలు సోమిరెడ్డి డిక్షనరీలోనే లేవన్నారు.

బాబు ప్రాపకం కోసం పాకులాట

ఇటీవల విజయవాడలో వరదలు వస్తే సోమిరెడ్డిని చంద్రబాబు పిలవలేదని, బాబు ప్రాపకం కోసం తెగపాకులాడుతున్నారని విమర్శించారు. చంద్రమోహన్‌రెడ్డి పరిస్థితి చంద్రబాబుకు బాగా తెలుసని, గతంలో నంద్యాల ఉప ఎన్నికల్లో ఆయన చేసిన ఘనకార్యాలపై అక్కడి టీడీపీ నాయకులు చంద్రబాబుకు ఫిర్యాదు చేశారని గుర్తు చేశారు. ఇటీవల సోమశిలకు వచ్చిన చంద్రబాబు కళ్లల్లో పడడానికి సోమిరెడ్డి తెగ పాకులాడినా కనీసం బాబు పట్టించుకోలేదన్నారు. సాగునీటిపై కనీస అవగాహన లేకుండా తెగ మాట్లాడే సోమిరెడ్డి తీరు చూస్తుంటే ఇతనేనా ఇన్ని సార్లు మంత్రిగా వెలగబెట్టాడనే అనుమానాలు వస్తున్నాయన్నారు.

జగన్‌ను విమర్శించే స్థాయి నీకు లేదు

మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించే స్థాయి నాలుగు సార్లు ఓటమి పాలైన సోమిరెడ్డికి లేదని కాకాణి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తన స్థాయి ఏంటో తెలుసుకుని మాట్లాడాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శిస్తే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని సోమిరెడ్డిని హెచ్చరించారు. లేఅవుట్ యజమానులకు బెదిరింపులు, యాష్, ఇసుక దోపిడీ చేసుకునే స్థాయి తప్ప.. పరిపాలించే అర్హత లేదన్నారు. పోస్టింగుల కోసం ఎంతో మంది వద్ద పెద్ద మొత్తంలోనే డబ్బులు దండుకున్నావే.. వరదల్లో చిక్కుకున్న వారి పరిస్థితి ఏమిటో కొంచమైనా చూశావా అంటూ విమర్శించారు. వరద అంత వచ్చింది.. ఇంత వచ్చిందంటూ అవగాహనారాహిత్యంతో మాట్లాడ డం మాని ఆ వరదల్లో కష్టాల్లో కూరుకుపోయిన జనానికి ఏదైనా చేయ్ ముందంటూ హితువు పలికారు. ఎక్కడో వరద గురించి కాదని, రేపు జిల్లాలో జరిగే నష్టం గురించి మాట్లాడాలని సవాల్ చేశారు. జిల్లాలోని సంగం వద్ద ఇసుక దోపిడీ చేస్తూ సూరాయపాళెం వద్ద నింపుకుంటూ సంగం బ్యారేజీని ప్రమాదంలో నెట్టుతున్నారని కాకాణి మండిపడ్డారు. సోమిరెడ్డి ఇసుక దోపిడీ వల్ల సంగం బ్యారేజీ ప్రమాదంలో పడుతోందన్నారు.

క్లుప్తంగా

బాలుడి ఆచూకీ కోసం..


మహేష్ (ఫైల్)

కావలి: పట్టణంలోని అరుంధతిపాళెం ప్రాంతానికి చెందిన గొడుపేరు మహేష్ (14) ఈనెల 11వ తేదీ నుంచి కనిపించడం లేదని తల్లిదండ్రులు చిన్నయ్య, శిరీష తెలిపారు. పట్టణంలోని జర్నలిస్ట్ క్లబ్‌లో సోమవారం వారు వివరాలు వెల్లడించారు. మహేష్ కావలిలోని కాకతీయ హైస్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. 11వ తేదీ సాయంత్రం ఏడు గంటల నుంచి కనిపించడం లేదు. కుటుంబసభ్యులు గాలించారు. అయినా ప్రయోజనం లేకుండాపోయింది. దీంతో ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతని ఆచూకీ తెలిస్తే 82206 61333, 63053 85671 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పొట్టకూటి కోసం వెళ్లి..

- కువైట్‌లో కమ్మవారిపల్లి వాసి ఆత్మహత్య


వెంకటేశ్వర్లు (ఫైల్)

సోమశిల: పొట్టకూటి కోసం వేరే దేశానికి వెళ్లిన మండలంలోని కమ్మవారిపల్లికి చెందిన రేణింగి వెంకటేశ్వర్లు (46) ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు సోమవారం వివరాలు వెల్లడించారు. వెంకటేశ్వర్లుకు భార్య సుమతి, ఒక కుమార్తె ఉన్నారు. అతను వ్యవసాయ పనులు చేసేవాడు. అయితే ఆర్థిక సమస్యలు తలెత్తాయి. కువైట్‌లో అప్పటికే బంధువులు ఉండడంతో వారి ద్వారా అక్కడికి వెళ్లాడు. చిన్నాచితకా పనులు చేసేవాడు. అయితే జీతాలు ఇవ్వకపోవడంతో మానసికవేదనకు గురయ్యాడు. కుటుంబ అవసరాలకు కూడా డబ్బు పంపలేని పరిస్థితి రావడంతో తాను ఉంటున్న గదిలోనే ఇటీవల ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని స్వగ్రామం కమ్మవారిపల్లికి సోమవారం తీసుకురాగా అంత్యక్రియలు చేశారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వీడియో, రీల్స్ పోటీలు

- ప్రముఖ ఆలయాల ఔన్నత్యం తెలిపేలా చిత్రీకరణ
- ఈ నెల 22లోగా ఆన్‌లైన్‌లో పంపాలి
- జిల్లా పర్యాటకాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెల 27న ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో జిల్లాలోని చారిత్రాత్మక ప్రదేశాలు, సముద్రతీర ప్రాంతాలు, ప్రముఖ ఆలయాల ఔన్నత్యం తెలిపేలా వీడియో, రీల్స్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలకు ఒక నిమిషం నిడివి వీడియోలు లేదా 15 నుంచి 30 సెకన్ల నిడివి రీల్స్‌ను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న ప్రకృతి ప్రేమికులు జిల్లాలో ప్రసిద్ధ దర్శనీయ ప్రదేశాలైన ఉదయగిరి దుర్గం, మైపాడు బీచ్, ఇసుకపల్లి బీచ్, లైట్‌హౌస్, రామాయపట్నం బీచ్, లైట్‌హౌస్, జొన్నవాడ మల్లికార్జునస్వామి కామాక్షితాయి అమ్మవారి ఆలయం, నరసింహకొండలోని వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, పెంచలకోనలోని పెనుశిల నరసింహస్వామి ఆలయం, నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయం, కండలేరు, సోమశిల రిజర్వాయర్లు తదితర పర్యాటక ప్రదేశాలు కవరయ్యేలా వీడియో, రీల్స్‌ను చిత్రీకరించి క్యూఆర్ కోడ్ ద్వారా ఈ నెల 22వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా పంపాలని కోరారు. అత్యుత్తమ వీడియో, రీల్స్ చిత్రీకరించిన విజేతలకు మొదటి బహుమతి కింద రూ.15 వేలు, 2వ బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.5 వేలు, ఐదుగురికి రూ.వెయ్యి చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు ఆయన చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి మొబైల్ నంబర్ 98480 07024ను సంప్రదించాలని సూచించారు.

కండలేరులో 13.683 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 13.683 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 8,000 క్యూసెక్కుల నీరు చేరుతోందని వెల్లడించారు. అదేవిధంగా కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 170, లోలెవల్ కాలువకు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.100
నన్నవి : రూ.50
పండ్లు : రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 127
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 230
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 254
లేయర్ చికెన్	: 187




సీట్లు తగ్గిపోవడం ఇబ్బందే..



మెడికల్ సీట్లు తగ్గించడం ఇబ్బందికర అంశమే. సీట్లు, కళాశాలలు పెరిగితే ఎంతోమంది విద్యార్థులకు అవకాశాలు లభిస్తాయి. సీట్లు తగ్గిపోతే పోటీ పెరిగి ప్రతిభ కలిగిన విద్యార్థులు వెనకబడే పరిస్థితి ఉంటుంది. ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయం తీసుకుంటే బాగుంటుంది.
– జి.నారాయణరెడ్డి, లెక్చరర్, పొదలకూరు

పేదలకు వైద్య విద్య దూరం



మా బంధువుల అబ్బాయి ఎంబీబీఎస్ చేయాలన్న కోరికతో నీట్ రాశాడు. తెలివైన కుర్రాడు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు వైద్య విద్యను దూరం చేసినట్లయింది. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలపై ఇప్పటికైనా పునరాలోచించాలి.
– పల్లంరెడ్డి శ్రీహరిరెడ్డి, అక్కంపేట

వయసు తక్కువ.. నేరాలు ఎక్కువ


సతీష్‌కుమార్ నేరాలను వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్)

సతీష్‌కుమార్ విడవలూరు మండల వాసి. వయసు 24 సంవత్సరాలు మాత్రమే. చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలు చేస్తుండగా ఈనెల 15వ తేదీన నెల్లూరు రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూ.17 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారంటే సతీష్ ఏ స్థాయిలో దొంగతనాలు చేస్తాడో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే ఇతడిపై విడవలూరు పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్టెడ్ షీట్ ఉంది. పోలీసులు పలుమార్లు అరెస్ట్ చేసి జైలుకు పంపినా మారలేదు.


రవి హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు (ఫైల్)

గత నెలలో నెల్లూరు రామలింగాపురం అండర్ బ్రిడ్జి సమీపంలో కత్తి రవి అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో నిందితులైన ఆరుగురు వ్యక్తుల వయసు 25 ఏళ్లలోపే. అందరూ పాతనేరస్తులు. పలుమార్లు జైలుకు వెళ్లొచ్చారు. నిందితుల్లో ఒకడైన సాయి పీడీ యాక్ట్‌పై జైలుకు వెళ్లాడు. యథేచ్ఛగా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూనే ఉన్నారు. రవి హత్య కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు.

- అదుపుతప్పిన కొందరు యువకులు
- చెడు వ్యసనాలకు బానిసై పెడత్రోవ
- ముఠాలుగా ఏర్పడి హత్యలు
- జైలు జీవితం గడిపినా కానరాని మార్పు
- రౌడీషీట్లు తెరుస్తున్నా లెక్కే లేదు

నెల్లూరు(క్రైమ్): కొందరు యువకులు దారి తప్పారు. ఉరకలెత్తే ఉత్సాహంతో ముందుకు సాగాల్సిన వయసులో పెడత్రోవ పట్టారు. యువత అనుకుంటే సాధించలేనిదంటూ ఏమీ లేదంటారు. వారితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందని పెద్దలు చెబుతుంటారు. అయితే పలువురు ఏది మంచి? ఏది చెడు తెలుసుకోలేక వక్రమార్గాన్ని ఎంచుకుంటున్నారు. మద్యం, గంజాయి మత్తులో జోగుతూ దొంగతనాలు, దోపిడీలు, హత్యలకు వెనుకాడడం లేదు. తల్లిదండ్రుల కలలను నాశనం చేస్తూ రౌడీలుగా మారుతున్నారు. జిల్లాలో ఇటీవల చోటుచేసుకున్న నేరాల్లో నిందితులు అధికశాతం యువకులే. నెల్లూరు నగరంలో జరిగిన మూడు హత్య కేసుల్లో నిందితులందరూ దాదాపు పాతనేరస్తులే. వారిలో కొందరు బాలురు ఉండడం కలవరపాటుకు గురిచేస్తోంది.

మత్తులో జోగుతూ..

చాలామంది యువకులు మాదకద్రవ్యాలను వినియోగించడం అలవాటు చేసుకున్నారు. ఒకప్పుడు నగరాలు, పట్టణాలకే పరిమితమైన ఈ విష సంస్కృతి నేడు గ్రామాలకు పాకింది. గతంలో ఎవరో దారి తప్పిన కొందరు మాత్రమే వాటి జోలికి వెళ్లేవారు. నేడు అధికశాతం మంది మత్తులో జోగుతున్నారు. నలుగురు చేరితే చాలు.. మద్యం తాగడం అనేది సాధారణమైంది. మరికొందరు ఒకడుగు ముందుకేసి గంజాయి సేవిస్తున్నారు. తమ పిల్లలు మద్యం తాగారని తెలిసినా కొన్ని కుటుంబాల్లో పెద్దలు చూసీచూడనట్లు పోవాలనే చందాన వ్యవహరిస్తుండడంతో యువత హద్దు మీరుతోంది. తొలుత పార్టీ పేరుతో ఎంజాయి చేసేందుకు తాగిన వాళ్లు క్రమేపీ మత్తుకు బానిసలవుతున్నారు. ఈ సరదాలకు ప్రతిసారి డబ్బులు ఎక్కడి నుంచి వస్తాయి? దీంతో ముందు కుటుంబసభ్యులను ఏమార్చి చిల్లర దొంగతనాలు చేయడం, అబద్ధాలు చెప్పి ఎక్కువ మొత్తంలో నగదు తీసుకోవడం వంటివి చేస్తున్నారు. అవసరాలు కొందరిని నేరాల వైపు ప్రోత్సహిస్తున్నాయి. ఒకసారి నేరానికి పాల్పడితే ఇక అది అలవాటుగా మారుతోంది.

లోతుగా విచారించగా..

పలు కేసుల్లోని నిందితులను నెల్లూరు పోలీసులు విచారించగా స్నేహితుల వల్లే నేరాలు చేసినట్లు వెల్లడించారు. కొందరు యువకులు సులువైన మార్గంలో డబ్బు సంపాదనకు అలవాటుపడుతున్నారు. సిగరెట్ తాగేందుకు కేఫ్‌కు, మద్యం తాగేందుకు బార్‌కు వెళ్లిన సమయంలో నేరస్తులతో పరిచయమవుతోంది. అనంతరం వారు స్నేహితులుగా మారుతున్నారు. అక్కడి నుంచే నేర సంస్కృతి మొదలవుతోంది. బృందాలుగా ఏర్పడి మద్యం మత్తులో దాడులకు పాల్పడుతున్నారు. ఆధిపత్యం కోసం తెలిసీతెలియని వయసులో హత్యలు చేస్తున్నారు. మద్యం మత్తులో హత్యలకు పాల్పడి కేసులకు భయపడి పరారవుతున్నవారు లేకపోలేదు.

పర్యవేక్షణ లేక..

ఎదిగిన కొడుకు ఇల్లు విడిచి బయటకు వెళ్లాక ఎక్కడున్నాడు?, ఏం చేస్తున్నాడు?, అర్ధరాత్రి ఎందుకొస్తున్నాడు?, స్నేహితులెవరు? అధికశాతం మంది తల్లిదండ్రులు ఈ విషయాలను ఆలోచించడం మానేస్తున్నారు. ఉండేది ఒకరిద్దరు.. సంపాదించిందంతా వారి కోసమే. సంతోషంగా ఉండాలనే భావనలో ఉన్నారు తప్ప కళాశాలకో.. బయటకు వెళ్లిన వారు ఏం చేస్తున్నారనే పర్యవేక్షణ లేకపోవడంతోనే అనేకమంది సులభంగా చెడు మార్గం పడుతున్నారు. పిల్లలు ఎవరితో స్నేహం చేస్తున్నారు?, ఎవరిని కలుస్తున్నారు? తదితర విషయాలపై తల్లిదండ్రులు ఆరాతీయాలి. నిత్యం వారిపై నిఘా ఉంచాలి. హద్దు మీరుతుంటే దండించాలి.

జీవితం నాశనమే..

ఒక్కసారి రౌడీషీట్, సస్పెక్టెడ్‌షీట్ తెరిస్తే భవిష్యత్ నాశనమైనట్లే. ఉద్యోగం రాదు. నిరంతరం పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగాల్సిన దుస్థితి నెలకొంటుంది. ఎక్కడ ఏం జరిగినా మొదటగా వారినే పోలీసులు అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారిస్తారు. వీవీఐపీల పర్యటనలు, ఎన్నికల వేళ ముందస్తుగా బైండోవర్లు చేస్తారు. ప్రతి ఆదివారం సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి హాజరు వేసుకోవాల్సి ఉంటుంది. చీకటి కార్యకలాపాల్లో పాల్గొంటున్నారని పోలీసులకు అనుమానం వస్తే తమదైన శైలిలో కౌన్సెలింగ్ ఇస్తారు. ఎక్కడికి వెళ్లాలన్నా పోలీసుల అనుమతి తప్పనిసరి. షీట్లున్నా పదేపదే నేరాలకు పాల్పడుతుంటే పీడీ యాక్ట్‌లు ప్రయోగిస్తారు. ఒక్కో సందర్భంలో జిల్లా బహిష్కరణకు వెనుకాడరు. నేరస్తుడిగా ముద్రపడితే జీవితాంతం బాధపడక తప్పదు. అందువల్ల యువత తస్మాత్ జాగ్రత్తగా ఉండాలి. నేరబాట పట్టారో జీవితం అంధకారమేనని పోలీస్ అధికారులు పేర్కొంటున్నారు.

కొన్ని ఘటనలు


వేణు మృతదేహం (ఫైల్)

- నెల్లూరు బీవీ నగర్ రైల్వేగేట్ సమీపంలో వేణు అనే వ్యక్తి గత నెలలో హత్యకు గురయ్యాడు. నిందితుల్లో ఒకరి వయసు 25 ఏళ్లు, ఇద్దరి వయసు 18 ఏళ్లు, మరో ఇద్దరు బాలలు. వ్యసనాలకు బానిసైన వీరు నేరాల బాటపట్టారు. పద్ధతిగా ఉండాలని సూచించిన వ్యక్తినే దారుణంగా హత్య చేశారు.
- సెటిల్‌మెంట్ వ్యవహారంలో వచ్చిన డబ్బుల పంపకంలో విభేదాలు తలెత్తి నెల్లూరు ముత్యాలపాళెంలో ఈనెలలో పాల్ అనే వ్యక్తి హత్య జరిగింది. నిందితుల వయసు 25 ఏళ్లలోపే. వీరిపై పలు పోలీస్‌స్టేషన్లలో కేసులున్నాయి.
- ఓ చోరీ కేసులో కందుకూరు పోలీసులు ఇటీవల అరెస్ట్ చేసిన ఇద్దరు నిందితులు పాతనేరస్తులు. ఒకరిపై ఏడు కేసులు ఉండగా, ఇంకొకరిపై ఒక కేసు ఉంది. పలుమార్లు జైలుకు వెళ్లివచ్చినా వీరి తీరులో మార్పులేదు. ఏడు కేసులున్న అతని వయసు 18 లోపే.
- ఈనెల 15వ తేదీన ఆత్మకూరు పట్టణంలోని మెయిన్ బజార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట గంజాయి మత్తులో దీక్షిత్ అనే యువకుడు ముగ్గురిపై కత్తితో దాడికి పాల్పడ్డాడు. అతను గంజాయి సేవిస్తుండగా వారించారని కక్ష కట్టి మరీ దాడి చేశాడు. దీక్షిత్ ఇప్పటికే మద్యానికి బానిసయ్యాడు.


వేణు హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు (ఫైల్)

బీసీ కాలనీలో కన్నీటి సుడులు


ఘటన జరిగిన ఇల్లు


మరో ఇంట్లో రేకులు పడిపోవడంతో గదిలో ధ్వంసమైన వస్తువులు

మనుబోలు: అందరూ సంతోషంగా ఉన్న సమయంలో జరిగిన బాణసంచా పేలుడుతో చాలా కుటుంబాలు విషాదంలో మునిగిపోయాయి. బీసీ కాలనీ.. ఇది మనుబోలు హైవేకి కూతవేటు దూరంలో ఉంటుంది. ఇక్కడ ఉండేది మధ్య, దిగువ మధ్య తరగతి వారే. చందాలు వేసుకుని అట్టహాసంగా వినాయక ఉత్సవాలను చేస్తుంటారు. ఈసారి కూడా అలాగే చేశారు. ఆదివారం రాత్రి గణేశ్ గ్రామోత్సవంలో అందరూ సందడి చేస్తుండగా ఒక్కసారిగా కాలనీపై బాణసంచా పేలుడు జరిగింది. ఈ ప్రమాదంలో 23 మంది గాయపడగా, మహేష్ అనే బాలుడు మృతిచెందాడు. బాధితుల్లో అధికంగా పిల్లలు, మహిళలే ఉన్నారు. బొజ్జ గణపయ్యను దర్శించుకుని వద్దామని వెళ్లిన వాళ్లు రక్తమోడుతూ ఆస్పత్రుల పాలవడంతో వారి కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఈ ఘటన కారణంగా ఐదు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పైకప్పులు, తలుపులు, అద్దాల కిటికీలు, వస్తువులు పాడై పనికి రాకుండా పోయాయి. ఇక టపాసులు పేలిన ఇంటికి సంబంధించిన వారైతే సర్వం కోల్పోయి వీధిన పడ్డారు.

రూ.2 లక్షలకు పైగా నష్టం



మా ఇంటి ఆవరణలోనే టపాసులు నిల్వ చేసి ఉండగా పేలిపోయాయి. ప్రహరీ కూలిపోయింది. మోటార్‌బైక్, ఏసీ, వాషింగ్ మెషీన్, ఇతర వస్తువులు పనికి రాకుండా పోయాయి. మెయిన్ డోర్, గేట్ డోర్ ఊడిపోయాయి. రూ.2 లక్షలకు పైగా నష్టం వాటిల్లి ఉంటుంది. రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు మావి. ఏం చేయాలో అర్థం కావడం లేదు.
– చలగల శివకుమార్, సూరమ్మ

క్షణాల్లో జరిగిపోయింది



వినాయక మండపం ఇంటికి దగ్గరలోనే ఉండడంతో దేవుడిని దర్శించుకుందామని వెళ్లా. అంతలో పెద్ద శబ్దం వచ్చింది. కాలుకి పెంకులు, సన్నని వస్తువులు బలంగా గుచ్చుకోవడంతో రక్తమొచ్చింది. స్థానికులు వెంటనే ఆస్పత్రికి తరలించారు.
– తుపాకుల దీపిక, కాలనీ వాసి

షాక్‌లో ఉన్నా



ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో అందరితోపాటే వినాయక మండపం వద్ద ఉన్నా. గ్రామోత్సవం కోసం సిద్ధం చేస్తున్నారు. యువకులు బాణసంచా పేలుస్తున్నారు. అంతా సందడిగా ఉంది. అంతలోనే పెద్ద శబ్దం. క్షణాల్లో ఆ ప్రాంతమంతా రోదనలతో నిండిపోయింది. నాకు తల వెనుక వైపు గాయమైంది. శరీరమంతా సూదులతో పొడిచినట్లుగా గాయాలయ్యాయి. ఇప్పటికి షాక్‌లోనే ఉన్నా.
– కావేటి పెంచలయ్య

వ్యర్థాలను అలాగే వదిలేశారు



నెల్లూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని డంపింగ్ యార్డులో కొద్దిరోజులుగా వ్యర్థాలను తొలగించకపోవడంతో ఆ ప్రదేశం మొత్తం దుర్వాసన వెదజల్లుతోంది. అపరిశుభ్ర వాతావరణం కారణంగా రోగాలు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. హాస్పిటల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు

బంధువుల ఇంటికొచ్చి.. కానరాని లోకాలకు..

- బాణసంచా పేలిన ఘటనలో గాయపడిన బాలుడి మృతి
- బీసీ కాలనీలో విషాదం


మహేష్ (ఫైల్)

మనుబోలు: గణేశ్ నిమజ్జనాన్ని చూసేందుకు బంధువుల ఇంటికొచ్చిన బాలుడు అకాల మరణం చెందాడు. వినాయక ఉత్సవాల్లో భాగంగా మనుబోలు బీసీ కాలనీలో ఆదివారం రాత్రి బాణసంచా పేలిన ఘటనలో గాయపడిన కందలి మహేష్ (12) మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. బాలాయపల్లి మండలం పిగిలాం గ్రామానికి చెందిన కందలి శ్రీనివాసులు, భార్గవి దంపతులకు మహేష్, వికాశ్రీ సంతానం. శ్రీనివాసులు వ్యవసాయ పనులు చేస్తుంటాడు. మహేష్ వెంకటగిరిలోని ఆర్కే ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. వరుస సెలవులు రావడంతో వినాయక నిమజ్జనాన్ని చూసేందుకు మనుబోలు బీసీ కాలనీలో ఉంటున్న మేనత్త ఇంటికొచ్చాడు. ఉత్సవంలో ఉండగా హఠాత్తుగా జరిగిన పేలుడులో మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని చికిత్స నిమిత్తం మొదట గూడూరుకు తీసుకెళ్లారు. అక్కడి డాక్టర్ల సూచన మేరకు నెల్లూరుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం చెన్నై తరలిస్తుండగా దారిలో చనిపోయాడు. సోమవారం మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేయించి కుటుంబానికి అప్పగించారు. అప్పటి వరకు సందడి చేసిన బాలుడు విగతజీవిగా మారాడని తెలియడంతో మనుబోలు బీసీ కాలనీలో విషాదం నెలకొంది. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లగా కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదించారు. కాగా మహేష్ సోదరి వికాశ్రీ, నానమ్మ పెంచలమ్మ గాయపడగా వారు చికిత్స పొందుతున్నారు.

దామరమడుగు కాలువలో మృతదేహం


వెంకటేశ్వర్లు మృతదేహం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రేబాల గ్రామం దామరమడుగు కాలువలో సోమవారం ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసుల కథనం మేరకు.. కాలువలో మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చనిపోయిన వ్యక్తిని రేబాల గ్రామానికి చెందిన డి.వెంకటేశ్వర్లు (35)గా గుర్తించారు. అతడికి వివాహం కాలేదు. మృతదేహాన్ని బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరుకు తరలించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.